బాణసంచా విక్రయాలకు ఏర్పాట్లు

- నిబంధనలు పాటిస్తేనే స్టాళ్లకు అనుమతి
- ఏసీపీ అన్నెపు నరసింహమూర్తి
- గోపాలపట్నంలో 31, సింహాచలంలో 4, ఎన్‌ఏడీలో 13 దరఖాస్తులు


దుకాణాలు తనిఖీ చేస్తున్న ఏసీపీ నరసింహమూర్తి


గోపాలపట్నంలో ఏర్పాటు చేసిన స్టాళ్లు

గోపాలపట్నం: దీపావళి అంటే ఇంటిల్లపాది సంతోషంగా చేసుకునే పండగ.... పిల్లలు టపాసులు కాల్చడమంటే ఎంతో సంబర పడతారు. సంతోషాల దీపావళిని ఆనందకర వాతావరణంలో జరుపుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. పర్యావరణ హితంగా ఉన్న గ్రీన్ టపాసులు మాత్రమే కాల్చాలని అధికారులు కోరుతున్నారు. మరో వైపు దీపావళి సామగ్రి విక్రయించడానికి తాత్కాలిక స్టాళ్లు ఏర్పాటు చేస్తున్నారు. నిర్వాహకులు దరఖాస్తులు చేసుకున్నారు. గోపాలపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలో గోపాలపట్నం వెనుక భాగంలో 31, సింహాచలంలో 4 స్టాళ్ల ఏర్పాటు చేసేందుకు దరఖాస్తులు వచ్చాయి. అలాగే ఎయిర్‌పోర్టు పోలీస్ స్టేషన్ పరిధిలో ఎన్‌ఏడీ జంక్షన్ ఆల్ఫా హోటల్ వెనుక ఖాళీ స్థలంలో 13 దుకాణాలు ఏర్పాటు చేసేందుకు దరఖాస్తులు వచ్చాయి. ఈ స్టాళ్ల నిబంధనల ప్రకారం ఏర్పాటు చేయాలని పోలీసులు స్పష్టం చేస్తున్నారు. ఈ మేరకు బుధవారం దుకాణాలను వెస్ట్ సబ్ డివిజన్ ఏసీపీ నరసింహమూర్తి పరిశీలించారు. నిర్వాహకులకు పలు సూచనలు చేశారు.

నిబంధనలు ఇవే..

స్టాల్‌కు స్టాల్‌కు మధ్య 10 అడుగుల వ్యత్యాసం ఉండాలి. ప్రతీ స్టాల్ ముందు బకేట్లతో ఇసుక, డ్రమ్ముల్లో నీరు ఉంచుకోవాలి. సక్రమమైన విద్యుత్ వైరింగ్ ఉండాలి. విద్యుత్ , ఫైర్ అధికారుల, జీవీఎంసీ అనుమతులు తప్పనిసరిగా ఉండాలని సూచించారు. దకాణాల ఏర్పాటుకు ఐరన్, సిమెంట్ సీట్లు మాత్రమే వాడాలన్నారు. దుకాణాల్లో చిన్న పిల్లలు ఉండరాదని సూచించారు. అలా ఉంటే వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. పర్యావరణ హితమైన గ్రీన్ టపాసులు మాత్రమే అమ్మకాలు జరపాలని సూచించారు. ప్రమాదం సంభవిస్తే వినియోగదారులు, దుకాణదారులు తప్పించుకునే విధంగా రెండు ద్వారాలు ఉండాలన్నారు. ఆయనతో పాటు ఎయిర్‌పోర్టు, గోపాలపట్నం సీఐలు బీఎండీ ప్రసాద్, సంతోష్ కుమార్, ఎయిర్ పోర్టు ఎస్ఐ రామకృష్ణ, గోపాలపట్నం ఎస్ఐ రామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

కొత్తపాలెం శ్మశానవాటికలో విద్యుత్ లైట్ల ఏర్పాటు


విద్యుత్ లైట్లు ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

గోపాలపట్నం: జీవీఎంసీ 89వ వార్డు కొత్తపాలెం శ్మశానవాటికలో హైమాస్ట్ విద్యుత్ లైట్లను విద్యుత్ శాఖ అధికారులు ఏర్పాటు చేశారు. కొద్ది రోజులుగా ఇక్కడ విద్యుత్ దీపాలు వెలగక పోవడంపై ఫిర్యాదు రావడంతో అధికారులు స్పందించారు. విద్యుత్ స్తంభానికి మరమ్మతులు చేపట్టి కొత్త లైట్లను అమర్చారు. సమస్య పరిష్కారం కావడంతో స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

అయ్యప్ప ఆలయంలో ప్రత్యేక పూజలు

మల్కాపురం: స్థానిక అయ్యప్పస్వామి ఆలయంలో బుధవారం ఉదయం ప్రత్యేక పూజలు జరిగాయి. పారిశ్రామిక ప్రాంతంలో పలువురు కన్నెస్వాములు మాలధారణ చేయడంతో గురుస్వామితో కలిసి భజన చేశారు. మందిరం వద్ద స్వాముల కోసం పీఠం ఏర్పాటు చేశారు. నేటి నుంచి 41 రోజుల పాటు ఉదయం,సాయింత్రం ప్రత్యేక పూజలు జరుగుతాయని గురుస్వామి వివరించారు.

విశాలాంధ్ర పుస్తక ప్రదర్శన పోస్టర్ ఆవిష్కరణ


పుస్తక ప్రదర్శన పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డీసీపీ-1 శ్రీనివాసరావు తదితరులు

అల్లిపురం: విశాలాంధ్ర బుక్ హౌస్ విశాఖపట్నం శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 25 నుంచి నిర్వహించనున్న విశాలాంధ్ర విశాఖ 22వ పుస్తక ప్రదర్శన ప్రచార పోస్టర్‌ను నగర శాంతి భద్రతల డీసీపీ-1 కె. శ్రీనివాసరావు ఆవిష్కరించారు. బుధవారం సాయంత్రం పోలీస్ కమిషనరేట్ సమావేశ మందిరంలో జరిగిన కార్యక్రమంలో ఆయన విశాలాంధ్ర బుక్ హౌస్ ప్రతినిధులు పీపీ రాజు, అరసం జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పల అప్పలరాజు, సభ్యులు సీఎస్ క్షేత్రపాల్‌రెడ్డి, శ్యాంసుందర్ తదితరులతో కలిసి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విశాలాంధ్ర ప్రచురణ సంస్థలు తెలుగు సాహిత్య విస్తరణకు విశేష కృషి చేస్తున్నాయన్నారు. పుస్తక మహోత్సవాన్ని పుస్తకప్రియులు, సాహితీవేత్తలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఆధార్‌తో బ్యాంకు ఖాతా తెరచి మోసం

మర్రిపాలెం: గతంలో ఓ ఇంట్లో అద్దెకు ఉండి.. యజమాని ఆధార్ కార్డు తీసుకుని వేరే చోట బ్యాంకు ఖాతా తెరచి ఇంటి యజమానిని ఓ వ్యక్తి మోసం చేసిన ఘటన కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. వివరాలిలా.. కంచరపాలెం ఇందిరానగర్‌లో సత్తి పద్మావతి అనే మహిళ ఇంట్లో గొంప నాయుడు అనే వ్యక్తి చాలా కాలంగా అద్దెకు ఉన్నాడు. 2020లో ఇల్లు కాళీ చేసి వెళ్లిపోయాడు. ఆ సమయంలో గ్యాస్ కనెక్షన్ కోసం సదరు యజమానిని ఆధార్ కార్డు అడిగాడు. ఆమె ఇవ్వడంతో ఆ వ్యక్తి గాజువాకలోని ఓ బ్యాంకులో ఆధార్ కార్డుతో వేరే అకౌంట్‌ను తెరచి, లావాదేవీలు కొనసాగిస్తున్నాడు. అనుమానం వచ్చిన ఆమె తనకు ప్రభుత్వం ఇచ్చే పథకాల సొమ్ము తన అకౌంటుకు రావడం లేదని సచివాలయంలో ఆరా తీయగా.. ఆమెకు గాజువాకలోని ఓ బ్యాంకులో ఉన్న ఖాతాలో నగదు జమవుతుందని వారు చెప్పడంతో ఆమె నివ్వెరపోయింది. దీంతో కంచరపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ ఎస్.సాయి కేసు దర్యాప్తు చేపట్టారు.

నేడు సహస్ర తులసీదళార్చన

దాబాగార్డెన్స్: బురుజుపేట కనకమహాలక్ష్మి దేవాలయంలో గురువారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సహస్ర తులసిపూజ నిర్వహించనున్నారు. భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు.

పొరపాట్లకు తావులేకుండా ఓటరు జాబితా

- జాయింట్ కలెక్టర్ విశ్వనాథన్
- ఈఆర్‌వో, ఏఈఆర్‌వో, బీఎల్‌వోలు, సూపర్‌వైజర్లతో సమీక్ష


మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ విశ్వనాథన్

తాటిచెట్లపాలెం: ఓటరు జాబితాలో పొరపాట్లు, క్రమరాహిత్యాలు లేకుండా చూడాలని జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్ అన్నారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో భాగంగా డూప్లికేట్ ఓట్లను తొలగించే క్రమంలో జాగ్రత్త వహించాలని, ఒకటికి రెండు సార్లు క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. పశ్చిమ నియోజకవర్గ పరిధి ఈఆర్‌వో, ఏఈఆర్‌వో, బీఎల్‌వో, సూపర్‌వైజర్లతో అక్కయ్యపాలెం షాదీఖానాలో బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకే డోర్ నంబర్‌లో అధిక ఓట్లు ఉన్నా, ఒకరి పేరు మీద రెండు ఓట్లు ఉన్నా.. బీఎల్‌వోలు స్వయంగా ఆయా ఇళ్లకు వెళ్లి పరిశీలించాలని తెలిపారు. అన్ని వివరాలు సరిపోయిన తరువాతే ఓట్లను తొలగించాలన్నారు. డూప్లికేట్ ఓట్ల తొలగింపులో సంబంధిత ఓటరు నుంచి సమ్మతి తీసుకోవాలని స్పష్టం చేశారు. చిరునామా మారినా.. వలస వెళ్లిపోయినా వారి వివరాలను కచ్చితంగా తెలుసుకోవాలని, అనంతరం చర్యలు తీసుకోవాలని జేసీ సూచించారు. బీఎల్‌వోలు ఓటు సవరణలు ఈఆర్‌వో 2.0 ద్వారా ఆన్‌లైన్‌లో తప్పక అప్‌లోడ్ చేయాలన్నారు. ఎన్నికల నియమావళిని పాటిస్తూ, జాబితా రూపకల్పనలో అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని, చిన్న తప్పు కూడా లేకుండా అత్యంత పారదర్శకతతో కూడిన తుది ఓటర్ల జాబితాను ప్రచురించేందుకు అందరూ కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. సమావేశంలో డీఆర్‌వో కె.మోహన్ కుమార్, ఆర్డీవో హుస్సేన్ సాహెబ్, జీవీఎంసీ జోనల్ కమిషనర్, తహసీల్దార్లు, బీఎల్‌వోలు, సూపర్‌వైజర్లు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

నిరుపేదలకు పింఛన్ల అందజేత


పింఛన్ అందజేస్తున్న నమ్మి శ్రీను

విశాఖ విద్య: జీవీఎంసీ 90వ వార్డులో పలువురికి వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడారి ఆనంద్‌కుమార్ సొంతనిధులతో ప్రతీ నెలా పింఛన్ అందజేస్తున్నారు. వార్డు పరిధిలో 25 మందికి రూ.2,750ల చొప్పున బుధవారం వైఎస్సార్‌సీపీ నాయకుడు నమ్మి శ్రీను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైనప్పటికీ అనివార్య కారణాలతో పింఛన్ అందని వారితో పాటు ఆర్థికంగా వెనుకబడిన పేద కుటుంబాలను ఆదుకోవాలనే తలంపుతో ఆడారి ఆనంద్ కుమార్ ఎంతో ఉదారతతో డబ్బులు ఇస్తున్నారన్నారు.అలాంటి వ్యక్తి నియోజకవర్గానికి ఎమ్మెల్యేగా ఉంటే ప్రజానీకానికి మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్లు పూడి సత్యం, అప్పలనాయుడు, గోవిందరాజు, జీ. శ్రీను, సన్యాసిరావు, నమ్మి శేఖర్, ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

22 కిలోల గంజాయి స్వాధీనం


గంజాయితో నలుగురు నిందితులు

గోపాలపట్నం: అక్రమంగా తరలిస్తున్న 22 కిలోల గంజాయిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు మర్రిపాలెం వద్ద పట్టుకున్నారు. వారు తెలిపిన వివరాలిలా.. బుధవారం మర్రిపాలెం వద్ద గంజాయి తరలిస్తున్నారన్న పక్కా సమాచారంతో ఏసీపీ త్రినాథరావు ఆధ్వర్యంలో సిటీ టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేశారు. ఈగంజాయి రవాణా చేస్తున్న నలుగురు వ్యక్తుల పట్టుకుని వారి వద్ద నుంచి 22 కిలోల గంజాయి, 4 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. నిందుతులను ఎయిర్‌పోర్టు పోలీసులకు అప్పగించగా.. వారు దర్యాప్తు చేస్తున్నారు.

వైభవంగా నిత్య కల్యాణం


అప్పన్న ఉత్సవమూర్తులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అదిష్టింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

ఉక్కు పరిరక్షణ ఉద్యమానికి సంఘీభావం


దీక్ష శిబిరం వద్ద ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి

గాజువాక: విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వరంగంలోనే కొనసాగించాలని కోరుతూ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షలు వెయ్యి రోజులు పూర్తయిన సందర్భంగా చేపట్టిన నిరసనకు వివిధ సంఘాలు, పార్టీలు సంఘీభావం తెలిపాయి. ఈ సందర్భంగా నియోజకవర్గ పరిధిలో వివిధ రూపాల్లో నిరసనలను నిర్వహించాయి.

- కాంగ్రెస్ పార్టీ గాజువాక నాయకులు నల్లబ్యాడ్జీలను ధరించి పాతగాజువాక జంక్షన్‌లో నిరసన తెలిపారు. కేంద్ర ప్రభుత్వం మొండి పట్టుదలను వీడి స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వరంగంలోనే కొనసాగిస్తామని ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం కూర్మన్నపాలెంలోని దీక్ష శిబిరానికి తరలి వెళ్లారు. కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు గొంప గోవిందరాజు, నాయకులు పి.రాకేష్‌రెడ్డి, గవర వెంకట రమణారావు, సోడాదాసు సుధాకర్, కె.చినబాబు, అస్మత్ అలీ తదితరులు పాల్గొన్నారు.
- స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను ఆపాలని డిమాండ్ చేస్తూ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో గాజువాకలో విద్యా సంస్థల బంద్ నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో నాయకులు ఎం.శశికుమార్, శ్రావణి, వినయ్, మహేష్, శ్యామ్, అప్పలరాజు పాల్గొన్నారు.
- స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్ నాయకులు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా గాజువాకలోని వివిధ విద్యా సంస్థల బంద్ నిర్వహించారు. ఆందోళనకు దిగిన నాయకులను గాజువాక పోలీసులు అరెస్టు చేసి కొద్దిసేపటి తరువాత విడుదల చేశారు.

12 గంటల నిరవధిక దీక్ష విజయవంతం

పెదగంట్యాడ: విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటుపరం చేయకుండా తమ వంతు ప్రయత్నాలు చేస్తున్నామని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం డెమోక్రటిక్ విశాఖ రిపబ్లిక్ స్టీల్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో పెదగంట్యాడ జంక్షన్‌లో బుధవారం నిర్వహించిన 12 గంటల నిరవధిక దీక్ష విజయవంతమైంది. ఈ శిబిరాన్ని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, చింతలపూడి వెంకట్రామయ్య, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి, కార్పొరేటర్లు దల్లి గోవింద్, ఉరుకూటి చందు, మహ్మద్ ఇమ్రాన్, గంధం శ్రీనివాసరావు తదితరులు సందర్శించి, దీక్షలో కూర్చున్న వారికి సంఘీభావం తెలిపారు.

అనంతుని పవిత్రోత్సవాలకు అంకురార్పణ


కుంతీ మాధవ స్వామి ఆలయంలో విశ్వక్షేన పూజ చేస్తున్న అర్చకులు

పద్మనాభం: పద్మనాభంలోని కుంతీ మాధవ స్వామి ఆలయంలో ఈ నెల 11 వరకు జరగనున్న అనంతుని పవిత్రోత్సవాలకు బుధవారం అంకురార్పన చేశారు. కుంతీ మాధవ స్వామి ఆలయంలో చక్ర పెరుమాళ్లు విగ్రహం వద్ద విశ్వక్షేన పూజ, పుణ్యాహవచనం నిర్వహించారు. తదుపరి చక్ర పెరుమాళ్లను కుంతీ మాధవ స్వామి ఆలయం నుంచి సంత నిర్వహించే పాత స్థలం వద్దకు పల్లకీలో తీసుకొచ్చి పూజ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

నైపుణ్యంతోనే విద్యార్థుల ఉన్నతి


నిర్వాహకులతో ఏవీఎన్ కళాశాల విద్యార్థులు, యాజమాన్యం

దాబాగార్డెన్స్: ఏవీఎన్ కళాశాలలో ఇన్నర్‌వీల్ క్లబ్ ఆఫ్ ఓషన్ సిటీ ఆధ్వర్యంలో బుధవారం విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ అండ్ మెంటరింగ్‌పై సదస్సు నిర్వహించారు. సైకాలజిస్ట్ పి.రవికాంత్ విద్యార్థుల భవిష్యత్‌కు మెంటరింగ్ ఆవశ్యకత, స్టార్టప్ కంపెనీలు ప్రారంభించడానికి కావల్సిన నైపుణ్యాలు వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎం.సింహాద్రినాయుడు మాట్లాడుతూ జీవన నైపుణ్యాలు విద్యార్థుల ఉన్నతికి ఏ విధంగా దోహదపడతాయో తెలిపారు. క్లబ్ సిటీ అధ్యక్షురాలు రాజకుమారి, కార్యదర్శి భరాతి రోహ్రా, కోశాధికారి సాయిలక్ష్మి, సభ్యులు స్వర్ణలత, భవ్య, ఫిజిక్స్ విభాగాధిపతి డి. సంతోష్‌కుమార్, ఎన్.అనంతలక్ష్మి, ప్రదీప్‌కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

లారీ ఢీకొని కార్పెంటర్ దుర్మరణం


మృతుడు అప్పలాచారి(ఫైల్)


ఆరిలోవ పోలీస్ స్టేషన్ వద్ద ఆందోళన చేస్తున్న మృతుడి బంధువులు, స్థానికులు

ఆరిలోవ: లారీ ఢీకొని ఓ కార్పెంటర్ మృతి చెందిన ఘటన ఓల్డ్ డెయిరీ ఫారం కూడలిలో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. దీనిపై స్థానికులు, మృతుడు బంధువులు ఆరిలోవ పోలీస్ స్టేషన్ వద్ద న్యాయం చేయాలంటూ బుధవారం ఆందోళనకు దిగారు. వివరాలిలా ఉన్నాయి. జీవీఎంసీ 12వ వార్డు దుర్గానగర్‌కు చెందిన కోరుకొండ అప్పలాచారి(36) కార్పెంటర్ పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈయన శ్రీకాకుళం జిల్లా రణస్థలంలో పని చేసుకుని మంగళవారం సాయంత్రం ద్విచక్ర వాహనంపై విశాఖ బయలుదేరాడు. జాతీయ రహదారిపై ఓల్డ్ డెయిరీ ఫారం వద్ద ఆరిలోవ వైపు తిరిగే సమయంలో జూ పార్కు వైపు నుంచి నగరంలోకి వెళ్తున్న లారీ వెనక నుంచి ఢీకొంది. దీంతో అప్పలాచారి కిందపడి సంఘటన స్థలంలోనే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఆరిలోవ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. పోలీసులు లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం కేజీహెచ్ మార్చురీకి తరలించారు. ఇదిలా ఉండగా లారీ యజమానిని పిలిపించి తమ కుటుంబానికి న్యాయం చేసేలా చూడాలని మృతుడు భార్య, పిల్లలు, బంధువులు, దుర్గానగర్ వాసులు బుధవారం ఆరిలోవ పోలీసు స్టేషన్ ఎదుట ఆందోళన చేశారు. ఫిర్యాదు చేయకుండా ఎలాంటి చర్యలు చేపట్టలేమని సీఐ సోమశేఖర్ వారికి నచ్చజెప్పారు. చివరకు సాయంత్రం ఈ ప్రమాదంపై మృతుడు భార్య జ్యోతి ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేశారు. మృతుడికి భార్య జ్యోతి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

రోడ్డు ప్రమాదాల నియంత్రణకు సహకరించాలి


మాట్లాడుతున్న ద్వారకా ఏసీపీ మూర్తి

ఆరిలోవ: రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రజలు సహకరించాలని ద్వారకా ఏసీపీ ఆర్‌వీఎస్ మూర్తి కోరారు. ఆరిలోవ పోలీసుల ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం విమ్స్ ఆవరణలో అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ వాహనచోదకులు ట్రాఫిక్ నియమ, నిబంధనలను తప్పనిసరిగా పాటించాలన్నారు. మద్యం మత్తులో డ్రైవింగ్, మితిమీరిన వేగంతో వాహనాలు నడపడం, నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేయడం వల్ల రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. ప్రమాదాలు జరగకుండా పోలీసులు తీసుకుంటున్న చర్యలకు ప్రజల సహకారం అవసరమన్నారు. ఎక్కువగా మైనర్లు వాహనాలు నడుపుతూ ప్రమాదాలకు కారణమవుతున్నారన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే ఎలాంటి ప్రమాదాలు జరగవని తెలిపారు. మరో వైపు సైబర్ నేరాలు పెరుగుతున్నాయన్నారు. సెల్‌ఫోన్లకు వచ్చే లింక్‌లు తెరవకూడదన్నారు. పిల్లలు సెల్‌ఫోన్లలో ఆటలు ఆడుతూ ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని, తల్లిదండ్రులు వారిని కనిపెడుతుండాలని ఆయన సూచించారు. విశాఖ ఏజెన్సీతో పాటు ఒడిశా, మధ్యప్రదేశ్‌ల నుంచి గంజాయి సరఫరా అవుతుందన్నారు. యువత గంజాయి, మత్తు పదార్థాలకు గురికాకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ట్రాఫిక్ సీఐ ప్రసాద్, ఆరిలోవ లా అండ్ ఆర్డర్ సీఐ సోమశేఖర్ మాట్లాడుతూ వాహనచోదకులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. అనంతరం వాహనచోదకులు, యూనియన్ నాయకుల నుంచి సలహాలు, సూచనలు తీసుకున్నారు. ఎన్‌హెచ్‌ఏఐ సైట్ ఇంజినీర్ కరీం, రెడ్‌క్రాస్ సంస్థ కార్యదర్శి రవికుమార్, పాఠశాల విద్యార్థులు ఆటో డ్రైవర్లు, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు పోటీలు


బహుమతులు పొందిన విద్యార్థినులతో నిర్వాహకులు

దాబాగార్డెన్స్: విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో బుధవారం కళాశాల రాజనీతిశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో విజిలెన్స్ అవగాహన వారోత్సవాలను పురస్కరించుకుని విద్యార్థినులకు పోటీలు నిర్వహించారు. విశాఖపట్నం పోర్టు ట్రస్ట్, భారతీయ జీవిత బీమా సంస్థ విశాఖ డివిజన్ సంయుక్త ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పోటీలో గెలుపొందిన విద్యార్థినులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల రాజనీతిశాస్త్ర విభాగం నుంచి జీ. జ్యోతి, డాక్టర్ బి. నాగమణి, ఎకనామిక్స్ విభాగం నుంచి డాక్టర్ కేఎల్ శిరీష, ఐక్యూఏసీ కన్వీనర్ డి. అరుణపద్మ, అధిక సంఖ్యలో విద్యార్థినులు పాల్గొన్నారు.

మానసిక ఒత్తిడే సమస్యలకు కారణం

మానసిక వైద్య నిపుణురాలు డాక్టర్ సాయిలక్ష్మి



విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న డాక్టర్ సాయిలక్ష్మి

సబ్బవరం: మానసిక ఒత్తిడే మనం ఎదుర్కొనే అన్ని సమస్యలకు మూలకారణం అవుతోందని ప్రముఖ మానసిక వైద్యురాలు డాక్టర్ సాయిలక్ష్మి అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం 'మేము ఉన్నాం-ఏ సమస్యకైనా పరిష్కారం ఉంది' అనే అంశంపై విద్యార్థులకు జిల్లా మెంటల్ హెల్త్ డిపార్ట్‌మెంట్, ఎన్ఎస్ఎస్ విభాగం సంయుక్తంగా అవగాహన సదస్సు నిర్వహించాయి. ఈ సందర్భంగా డాక్టర్ సాయిలక్ష్మి మాట్లాడుతూ విద్యార్థులు మానసికంగా ఎదుర్కొంటున్న సమస్యలకు గల కారణాలను, పరిష్కార మార్గాలను వివరించారు. 20 ఏళ్ల లోపు యువతీ యువకులు ఇటీవల కాలంలో తీవ్రమైన మానసిక ఒత్తిడికి గురై ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు. ప్రతి సమస్యకు పరిష్కారం ఉంటుందని చెప్పారు. సమస్యకు కారణం ఏంటో తెలుసుకుని కుటుంబ సభ్యులు, స్నేహితులు,బంధుమిత్రుల సహకారంతో సమస్యలను నుంచి బయట పడవచ్చన్నారు. మనుషుల మధ్య ఉండే సత్సంబంధాలు మానసిక ఆరోగ్యాన్ని పెంచుతాయన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ బి సీతాలక్ష్మి,మధులత, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ లెక్కల గణేష్,నివేదిత తదితరులు పాల్గొన్నారు.

కేజీహెచ్ సెక్యూరిటీ గార్డులకు కలెక్టర్ అభినందన


సెక్యూరిటీ గార్డుకు జ్ఞాపిక అందజేస్తున్న కలెక్టర్ మల్లికార్జున

మహారాణిపేట: గంజాయి అక్రమ రవాణాను అడ్డుకుని, నిందితులను పోలీసులకు అప్పగించిన కేజీహెచ్ సెక్యూరిటీ గార్డులను కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జునతో పాటు ఆస్పత్రి వైద్యులు అభినందించి, వారి సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా సెక్యూరిటీ గార్డులకు కలెక్టర్ జ్ఞాపికను బహూకరించారు. ఈనెల 6న సెక్యూరిటీ గార్డులు అల్లు కుమారస్వామి, రంగాల వినోద్‌కుమార్ కేజీహెచ్‌లో అనుమానాస్పదంగా తిరుగుతున్న ముగ్గురు మహిళల బ్యాగులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆ మహిళల బాగుల్లో గంజాయి బయట పడింది. దీంతో ఆ ముగ్గురు మహిళలను సెక్యూరిటీ గార్డులు వన్‌టౌన్ పోలీసులకు అప్పగించారు. మంగళవారం ఈ ఇద్దరు సెక్యూరిటీ గార్డులను నగర పోలీసు కమిషనర్ రవిశంకర్ అభినందించారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

డీసీపీ-2 ఆనందరెడ్డి


స్టీల్‌ప్లాంట్ స్టేషన్‌లో మొక్కలు నాటుతున్న డీసీపీ ఆనందరెడ్డి

ఉక్కునగరం: పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని నగర డీసీపీ-2 కె.ఆనందరెడ్డి అన్నారు. స్టీల్‌ప్లాంట్ పోలీస్ స్టేషన్‌లో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాలుష్య నివారణకు మొక్కలను పెంచాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. పర్యావరణ పరిరక్షణకు సహకరిస్తున్న స్టీల్‌ప్లాంట్ యాజమాన్యాన్ని అభినందించారు. స్టీల్‌ప్లాంట్ సీఐ మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ ఆగ్రోఫారెస్ట్ విభాగం సహకారంతో స్టేషన్ ఆవరణ, చుట్టుపక్కల సుమారు 300 పండ్ల మొక్కలు నాటుతున్నామన్నారు. కార్యక్రమంలో స్టీల్‌ప్లాంట్ సీజీఎం జి.గాంధీ, టౌన్ అడ్మిన్ జీఎం వై.చంద్రశేఖర్, సౌత్ ఏసీపీ టి.త్రినాథ్, వెస్ట్ ఏసీపీ ఎ.నర్సింహమూర్తి, హార్బర్ ఏసీపీ మోజెస్ పాల్, ట్రాఫిక్ ఏసీపీ జి.రాజీవ్ కుమార్, ట్రాఫిక్ ఎస్ఐ జి.ఉమామహేశ్వరరావు పాల్గొని మొక్కలు నాటారు.